

బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 146 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ సోమవారం 30 -12-2024 వెల: 5/రూ -




# రంగారెడ్డి జిల్లాకు ఎయిమ్స్ వర్సిటీ

200 ఎకరాల భూమి లభిస్తే ఏర్పాటు.. కన్హా శాంతివనం.. అద్భుత ప్రపంచం

పర్యావరణానికి మీ సేవలు అమోఘం.. నిర్వాహకుడు కమలేశ్‌తో రేవంత్

ఆర్‌ఆర్‌ఆర్ టెండర్లపై మంత్రి కోమటిరెడ్డికి సీఎం అభినందనలు

# ఏపీ కొత్త సీఎస్ విజయానంద్

## నియామక ఉత్తర్వులు జారీ

రాష్ట్రాభివృద్ధికి ఇద్దరూ కలిసి పనిచేయండి

సాయిప్రసాద్, విజయానంద్‌లకు సీఎం సూచన

నియామకానికి ముందు ఇరువురితో భేటీ



అమరావతి, డిసెంబరు 29 : రాష్ట్ర ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(పొలిటికల్) కార్యదర్శి ఎస్. సురేశ్‌కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం(31వ తేదీ) పదవీ విరమణ చేయన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్‌ను సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. అనంతరం ఆయన నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాగా, ఈ పోస్టుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు వినిపించాయి. వీరిలో జి. సాయి ప్రసాద్ పేరు ప్రముఖంగా తెరమీదికి వచ్చింది. అయితే, ఈయనకు సర్వీసు ఇంకా ఉండడంతో విజయానంద్ వైపే చంద్రబాబు మొగ్గు చూపారు. కాగా, తనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన

(మిగతా 2వ పేజీలో)



## ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల బలవన్మరణం

అప్పుల బాధతో ఒకరు, తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మరొకరు

ఉమ్మడి మెదక్ జిల్లాలో కలకలం



## హంపి అ'ద్వితీయం'




## మత్తుమందు దొరకని రాష్ట్రంగా తెలంగాణ

9.87% పెరిగిన క్రైమ్.. రికవరీలు అద్భుతం.. పక్కా వ్యూహంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సొత్తును వెనక్కు తేవడంలో రాష్ట్రం టాప్.. ఫోన్ ట్యాప్ కేసులో ఇంటర్‌పోల్ సాయం

'సంధ్య థియేటర్'పై విచారణ సాగుతోంది.. వార్షిక నివేదిక విడుదలలో డీజీపీ జితేందర్



# రైతు భరోసా ఎవరికి?

సాగు చేసిన మొత్తం విస్తీర్ణానికి ఇద్దామా?

ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంగతేంటి?

సింగరేణి, 4వ తరగతి ఉద్యోగులకు ఇవ్వాల్సిందే

కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలుంటే ఇవ్వొద్దు

కటాఫ్‌ను ఏ ప్రాతిపదికన నిర్ణయిద్దాం?

భట్టి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ

మరికొన్ని సార్లు సమావేశం కావాలని నిర్ణయం

సమగ్ర అధ్యయనం తర్వాతే క్యాబినెట్‌కు సిఫారసు

హైదరాబాద్, డిసెంబరు 29 : కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలున్న భూములను వదిలేసి... సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇద్దామా? ఆదాయపు పన్ను చెల్లింపుదారుల్లో ఏయే వర్గాలను మినహాయించాలి? ఎవరికి ఇవ్వాలి? సింగరేణి ఉద్యోగులకు, నాలుగో తరగతి ఉద్యోగులకు ఇవ్వొచ్చా? ఇవ్వకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? వంటి పలు అంశాలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఆదివారం సుదీర్ఘంగా చర్చించింది. సమావేశంలో తొలుత రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం, ఉపసంఘం పలు అంశాలపై చర్చలను ప్రారంభించింది. గతంలో ఉమ్మడి జిల్లాలవారీగా నిర్వహించిన సదస్సుల్లో వ్యక్తమైన అభిప్రాయాలు, అధికారులు తయారుచేసిన నివేదికలపై చర్చించారు. ఉపసంఘం చేపట్టిన క్షేత్రస్థాయి పర్యటనల్లో ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు రైతుభరోసా ఇవ్వొద్దనే అభిప్రాయాలు వ్యక్తమైన విషయం ప్రస్తావనకు వచ్చింది. అయితే, ఐటీ చెల్లించే సింగరేణి ఉద్యోగులు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో సుమారు 4 లక్షల మంది ఉన్నారని, వీరందరికి ఇవ్వకపోతే ఇబ్బంది అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం- కిసాన్ పథకం మార్గదర్శకాలు కూడా ఉపసంఘం భేటీలో చర్చకు వచ్చాయి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లు, ఐదేళ్లలో మూడుసార్లు లేదా వరుసగా రెండేళ్లు ఐటీ చెల్లించినవారు, వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, సీఏలు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులకు

(మిగతా 2వ పేజీలో)



# ఏపీలో మరో భారీ ప్రాజెక్టు

ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో నీటిపారుదల శాఖపై చంద్రబాబు సమీక్ష

ప్రతి ఎకరాలకు నీళ్లిచ్చేలా ప్రణాళిక

సముద్రంలో వృధాగా కలిసే నీటిని మళ్లించే బృహత్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు

కేంద్రం సాయం తీసుకోవాలని నిర్ణయం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ ఉండవల్లిలోని తన నివాసంలో నీటిపారుదల శాఖ పై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చి... రాష్ట్రాన్ని 100 శాతం కరువు రహిత రాష్ట్రంగా మార్చేందుకు భారీ ప్రణాళికలను అమలు చేయాలని నిర్ణయించారు. ఒకవైపు పోలవరం పూర్తి చేయడం ద్వారా 8 ఉమ్మడి జిల్లాలకు మేలు జరుగుతుందని, పోలవరంతో ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు,

(మిగతా 2వ పేజీలో)

# ఏపీలో మరో భారీ ప్రాజెక్టు

ప్రకాశం జిల్లాలకు కూడా లబ్ధి చేకూరుతుందని చంద్రబాబు తెలిపారు. గోదావరి నదిలో వరదల సమయంలో సరాసరి ఏటా 2 నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలుస్తోందని, ఈ నీటి నుంచి 280 టీఎంసీలను వరదల సమయంలో తీసుకోవడం ద్వారా... కృష్ణా డెల్టాకు, రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలు సహా ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు లబ్ధి చేకూర్చేందుకు కార్యచరణ తీసుకువస్తున్నట్టు వివరించారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు గోదావరి నీటిని బనకచర్లకు తరలించడమే మార్గం అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అటు పోలవరం, ఇటు ఈ కొత్త ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు

**ప్రాజెక్టు వివరాలు**

ఈ భారీ ప్రాజెక్టు ద్వారా విస్తృత స్థాయిలో రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, పరిశ్రమలకు మేలు జరగబోతోంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా సాగునీరు అందుతుంది. దీనితో పాటు 22.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. పరిశ్రమలకు దాదాపు 20 టీఎంసీల నీటిని వినియోగించవచ్చు. దీని కోసం రెండు మూడు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గోదావరి నీటిని కృష్ణా నదికి తరలిస్తారు. కృష్ణా నది నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. 200 టిఎంసిల సమర్థ్యంతో బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మిస్తారు. అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీటికి తరలిస్తారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు 31 కి.మీ టన్నెల్ ద్వారా నీటిని తరలిస్తారు. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ, %హా=దీజ%, నిప్పుల వాగుకు నీళ్ళు వెళుతుంటాయి. నిప్పుల వాగు ద్వారా సోమశిల, కండలేరుకు నీటిని తరలిస్తారు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని వివిధ లిఫ్టులు, కాలువల ద్వారా అన్ని ప్రాజెక్టులకు తరలిస్తారు.

**కేంద్ర ఆర్థిక సాయానికి ప్రయత్నాలు**

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ ప్రాజెక్టు చేపట్టడం అంత సులభం కాదు. అయితే ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే ఇదే పెద్ద గేమ్ ఛేంజర్ అవుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.70 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలుస్తోంది. 54 వేల ఎకరాల భూ సేకరణ జరపాల్సి ఉంటుంది. 4 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. పెద్ద మొత్తంలో ఫారెస్టు భూములు కూడా సేకరించాల్సి ఉంటుంది. ఇవన్నీ జరగాలంటే భారీ వ్యయం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వ్యయం చేసే అవకాశం లేదు. దీంతో ఈ ప్రాజెక్టు అవసరాన్ని, ప్రయోజనాలను కేంద్రానికి వివరించిన ముఖ్యమంత్రి కేంద్ర సాయం కూడా తీసుకుని దీన్ని పూర్తి చెయ్యాలని భావిస్తున్నారు. ఈ వారంలో జరిగిన ఢిల్లీ పర్యటనలో కేంద్ర పెద్దలతో ఈ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రాజెక్టు అవసరాన్ని వివరించి ఆర్థిక సాయంపై విన్నవించారు.

2 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేతగా తెలుగు తేజం

2 రెండోసారి టైటిల్‌తో కొత్త చరిత్ర

2 ద్రోణవల్లి హారిక, అర్జున్‌లకు ఐదోస్థానం

తెలుగు తేజం, చెస్ ధ్రువతార కోనేరు హంపి విశ్వవేదికపై అద్భుత ప్రదర్శన కనబరచింది. న్యూయార్క్‌లో జరిగిన ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలిచి అదరహో అనిపించింది. మొత్తం 11 రౌండ్లకు గాను 8.5 పాయింట్లు సాధించిన హంపి అగ్రస్థానంతో టైటిల్ కైవసం చేసుకుంది. 37 ఏళ్ల హంపికిది రెండో ర్యాపిడ్ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. 2019లోనూ విజేతగా నిలిచిన హంపి.. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ తర్వాత ఈ టోర్నీని ఒకటికంటే ఎక్కువసార్లు గెలిచిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఎనిమిది పాయింట్లతో ఐదోస్థానంతో సరిపెట్టుకుంది. ఓపెన్ విభాగంలో రష్యాకు చెందిన, 18 ఏళ్ల వొలొదార్ ముర్జిన్ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించాడు. టైటిల్ ఫేవరెట్‌గా పోటీపడ్డ అర్జున్ ఇరిగేసి 9 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమవగా.. ప్రజ్ఞానంద (8.5) 17వ, హర్ష భరత్‌కోటి (6.5) 98వ స్థానాలతో నిరాశపరిచారు.

# ఏపీ కొత్త సీఎస్ విజయానంద్

సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విజయానంద్ ధన్యవాదాలు తెలిపారు.

**ప్రత్యేక పరిస్థితులు: చంద్రబాబు**

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకానికి సంబంధించిన జీవో జారీకి ముందు సీనియర్ ఐఏఎస్ అధికారులు సాయిప్రసాద్, విజయానంద్‌లతో ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఇద్దరూ సీనియర్లే అయినప్పటికీ ప్రత్యేక పరిస్థితుల్లో విజయానంద్‌కు సీఎసగా అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇద్దరూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సీనియర్ ఐఏఎసల సహయ, సహకారాలు ప్రభుత్వానికి చాలా అవసరమని వివరించారు.

# హంపి అ'ద్వితీయం'

న్యూయార్క్: ఈ ఏడాది విశ్వ చదరంగ వేదికపై మరోసారి భారత పతాకం రెపరెపలాడింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత నంబర్‌వన్ కోనేరు హంపి విజేతగా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున ముగిసిన ర్యాపిడ్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 37 ఏళ్ల హంపి టైటిల్‌ను సొంతం చేసుకుంది. 110 మంది క్రీడాకారిణల మధ్య స్విస్ ఫార్మాట్‌లో 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హంపి 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను దక్కించుకుంది. విజేతగా నిలిచిన హంపికి 60 వేల డాలర్ల (రూ. 51 లక్షల 23 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. 10వ రౌండ్ ముగిశాక హంపితోపాటు మరో ఆరుగురు క్రీడాకారిణులు జు వెన్‌జున్ (చైనా), కాటరీనా లాగ్నో (రష్యా), టాన్ జోంగి (చైనా), ఇరినె ఖరిస్మా సుకందర్ (ఇండోనేసియా), ద్రోణవల్లి హారిక (భారత్), అఫ్రూజా ఖమ్‌దమోవా (ఉజ్బెకిస్తాన్) 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచి టైటిల్ రేసులో నిలిచారు. అయితే చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హంపి 67 ఎత్తుల్లో ఖరిస్మా సుకందర్‌పై గెలుపొందడం... జు వెన్‌జున్, కాటరీనా లాగ్నో, హారిక, టాన్ జోంగి, అఫ్రూజా తమ గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో హంపికి టైటిల్ ఖరారైంది. 8 పాయింట్లతో జు వెన్‌జున్, కాటరీనా లాగ్నో, టాన్ జోంగి, హారిక, అఫ్రూజా, అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్) ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ఈ ఆరుగురి ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. జు వెన్‌జున్‌కు రెండో స్థానం, కాటరీనాకు మూడో స్థానం లభించాయి. టాన్ జోంగి నాలుగో స్థానంలో, హారిక ఐదో స్థానంలో, కొస్టెనిక్ ఆరో స్థానంలో, అఫ్రూజా ఏడో స్థానంలో నిలిచారు.

**ఓటమితో మొదలు... గెలుపుతో ముగింపు**

ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హంపి 10వ సీడ్‌గా బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో అమీనా కైర్‌బెకోవా (కజకిస్తాన్) చేతిలో హంపి ఓడిపోయింది. ఆ తర్వాత రెండో రౌండ్‌లో జేనాబ్ (అజర్‌బైజాన్)పై, మూడో రౌండ్‌లో సలోమి మెలియా (జార్జియా)పై గెలిచి... అల్మీరా (ఫ్రాన్స్)తో నాలుగో రౌండ్ గేమ్‌ను 'డ్రా' చేసుకుంది.

# రైతు భరోసా ఎవరికి?



పీఎం- కిసాన్ పథకాన్ని వర్తింపచేయటం లేదు. అయితే, దీనిని రాష్ట్రంలో పూర్తిగా అనుసరించలేమని, కొన్ని వర్గాలను మినహాయించి మిగిలిన వర్గాలకు రైతుభరోసా ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. అందులో తప్పనిసరిగా సింగరేణి ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు ఉండేలా చూడాలని భావించారు.

**కటాఫ్ పెట్టినా.. అందరికీ వర్తించేలా!**

గడిచిన ఆరేళ్లలో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్య, సాగవుతున్న భూ విస్తీర్ణం, బడ్జెట్ కేటాయింపులపైనా చర్చించారు. మొత్తం కలిపి రూ.80,453 కోట్లు చెల్లించగా... ఇందులో సాగు చేయని భూములకు రూ.21,284 కోట్లు చెల్లించినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ అంశంపై ఉపసంఘం సభ్యులు దృష్టి సారించారు. సాగుకు యోగ్యంకాని భూములకు ఎట్టి పరిస్థితుల్లో రైతుభరోసా ఇవ్వొద్దని తీర్మానించారు. కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు, స్థిరాస్తి వెంచర్లు, రహదారుల భూసేకరణలో పోయిన భూములకు కూడా గత ప్రభుత్వంలో ఇచ్చారని, ఇలాంటి జాబితాలో ఉన్న భూములకు రైతుభరోసా ఇవ్వకూడదని ఏకాభిప్రాయానికి వచ్చారు. సాగు చేసిన భూములకు మాత్రమే రైతుభరోసా ఇచ్చే పక్షంలో... సంపన్నులకు, భూస్వాములకు ఇవ్వాలా? వద్దా? అనే చర్చ కూడా వచ్చింది. పదుల ఎకరాల్లో భూములున్న వారి సంగతేంటి? కటాఫ్ పెట్టాలా? కటాఫ్ పెడితే ఎన్ని ఎకరాలకు? తదితర అంశాలపైనా చర్చించారు. 10 ఎకరాల వరకు కటాఫ్ పెడితే.. 12 ఎకరాలున్న రైతులకు 10 ఎకరాలకు రైతు భరోసా ఇచ్చి మిగిలిన రెండెకరాలకు మినహాయించాలనే ప్రతిపాదన వచ్చింది.

**విధివిధానాల ఖరారు తర్వాతే బడ్జెట్ లెక్కలు**

కాగా, వ్యవసాయశాఖ అధికారులు స్లాబుల వారీగా రూపొందించిన నివేదికపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐదు, ఆరు, ఏడున్నర, పది ఎకరాల వారీగా కటాఫ్ నిర్ణయించి.. ఒక్కోదానికి ఎంత బడ్జెట్ అవుతుంది? అనే గణాంకాలు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చారు. ఇందులో 20 లక్షల మందిని తొలగిస్తే ఎలా ఉంటుంది? ఎంత బడ్జెట్ తగ్గుతుంది? అన్న వివరాలనూ వ్యవసాయశాఖ అధికారులు ఉపసంఘం ముందు తెలియజేశారు. దీనిపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనే చర్చించి, తుది నిర్ణయం తీసుకుందామని మంత్రివర్గ ఉపసంఘం భావించింది. విధివిధానాలు పూర్తిగా ఖరారైన తర్వాతే బడ్జెట్ లెక్కలు తేలనున్నాయి. కాగా మంత్రివర్గ ఉపసంఘం మరికొన్ని సార్లు సమావేశం కావాలని కూడా నిర్ణయించింది. రైతులకు సంబంధించిన అంశం కావటం, ప్రతిపక్షాలు అవకాశం దొరికితే విమర్శలు గుప్పించేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని చర్చించినట్లు తెలిసింది. మరిన్ని భేటీలు నిర్వహించి సమగ్రంగా చర్చించిన తర్వాతే ప్రతిపాదనలు సిఫార్సు చేయాలని ఉపసంఘం సభ్యులు నిర్ణయించారు.

# ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల బలవన్మరణం

## అప్పుల బాధతో ఒకరు, తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మరొకరు

## ఉమ్మడి మెదక్ జిల్లాలో కలకలం



సిద్దిపేటకమాన్/ కొల్చారం (నర్సాపూర్): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆదివారం ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. సిద్దిపేట పట్టణంలో అప్పుల బాధ భరించలేక ఒకరు, మెదక్ జిల్లా కొల్చారం మండలంలో తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మనస్తాపానికి గురై మరొకరు ఉరేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన బండారి బాలకృష్ణ (34).. భార్య మానస, ఇద్దరు కుమారులతో కలసి సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీలో నివాసం ఉంటున్నారు. బాలకృష్ణ రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ ఆర్మర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సిద్దిపేట నుంచి విధులకు వెళ్లి వస్తుంటారు. కాగా, బాలకృష్ణ ఫోనిక్స్ అనే ఓ ప్రైవేటు కంపెనీలో ఫోన్ పే, గూగుల్ పే, నెఫ్ట్ ద్వారా పలు విడతలుగా సుమారు రూ.25 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. ఈ క్రమంలో చాలా అప్పులు చేశారు. అయితే పెట్టుబడులపై ఆశించిన ఆదాయం రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని భార్యతో చెప్పి శనివారం రాత్రి ఎలుకల మందు కలిపిన టీని ఇద్దరు పిల్లలకు తాగించి, భార్యాభర్తలు కూడా తాగారు. ఆదివారం తెల్లవారుజామున మేలుకున్న బాలకృష్ణ లేచి చూడగా అందరూ స్పృహలోనే ఉన్నారు. ఇది గుర్తించి అతడు పక్క గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాలకృష్ణ భార్య మానస, ఇద్దరు కుమారులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు.

**బ్లాక్ మెయిల్ చేస్తున్నారని..**

మరో ఘటనలో మెదక్ జిల్లా కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాటూరి సాయికుమార్ (55) బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్ భార్య శైలజ, ఇద్దరు కుమార్తెలతో కలసి నర్సాపూర్‌లో ఉంటున్నారు. రోజూ అక్కడి నుంచే డ్యూటీకి వచ్చి వెళ్తుంటారు. శనివారం మధ్యాహ్నం కొల్చారం స్టేషన్‌కు డ్యూటీకి వచ్చారు. రాత్రి క్వార్టర్ రూమ్‌లో ఉన్నారు. ఆదివారం ఉదయం భార్య శైలజకు ఫోన్ చేసి, 'నేను చనిపోతున్నాను. నన్ను కొందరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు'అని చెప్పి స్టేషన్ ఆవరణలోని చెట్టుకు ఉరేసుకొన్నారు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు

**తీవ్రంగా వేధించారు: మృతుడి భార్య శైలజ**

కొంతకాలంగా నర్సాపూర్‌లోని ఓ మహిళతో సాయికుమార్ తరచూ ఫోన్‌లో మాట్లాడేవారని ఆయన భార్య శైలజ తెలిపారు. ఇది తెలిసిన ఆ మహిళ భర్త.. వివాహేతర సంబంధం అంటగట్టడంతోపాటు కేసు పెడతానంటూ వేధించేవాడని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా అతడి అల్లుడితో కలసి చంపుతామంటూ తరచూ బెదిరించేవారని పేర్కొంది. తన భర్త మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేశారు.

# మత్తుమందు దొరకని రాష్ట్రంగా తెలంగాణ

## 9.87% పెరిగిన క్రైమ్.. రికవరీలు అద్భుతం

## పక్కా వ్యూహంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

## సొత్తును వెనక్కు తేవడంలో రాష్ట్రం టాప్

## ఫోన్ ట్యాప్ కేసులో ఇంటర్‌పోల్ సాయం

## 'సంధ్య థియేటర్'పై విచారణ సాగుతోంది

## వార్షిక నివేదిక విడుదలలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, డిసెంబరు 29 : "తెలంగాణలో డ్రగ్స్ అమ్మాలన్నా.. కొనాలన్నా భయపడేలా.. పట్టుబడితే శిక్ష తప్పదనేలా చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రహితంగా.. మత్తుమందు దొరకని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం" అని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది మొత్తం 1,942 డ్రగ్స్ కేసుల్లో 4,682 మందిని అరెస్టు చేశామని, రూ.142.95 కోట్ల విలువైన మత్తుపదార్థాలను సీజ్ చేశామని గుర్తుచేశారు. ఈ కేసుల్లో నిందితులకు చెందిన రూ.55.8 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మావోయిస్టుల కట్టడికి, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. "సైబర్ నేరాల్లో డబ్బు పోగొట్టుకున్న వారికి రూ.180 కోట్ల మేర తిరిగి ఇప్పించాం. ఈ ఏడాది సైబర్ నేరాలకు సంబంధించి 25,184 ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది(17,571 ఫిర్యాదులు)తో పోలిస్తే.. సైబర్ నేరాల్లో 25.18% పెరుగుదల ఉంది. సైబర్ నేరాల్లో రికవరికీ సంబంధించి దేశంలోనే తెలంగాణ టాప్‌లో ఉంది" అని వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద ఈ ఏడాది నేరాల్లో 9.87% పెరుగుదల ఉందన్నారు. "గత ఏడాది మొత్తం 2,13,121 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 2,34,158గా ఉంది. వీటిల్లో 1,55,639 కేసులను నవంబరు నెలాఖరులోగా పరిష్కరించాం. ప్రాసిక్యూషన్, పోలీసు శాఖ కలిసి పనిచేయడం వల్ల చాలా కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడం సాధ్యమైంది. వీటిల్లో మూడు మరణ శిక్షలు, 215 జీవిత ఖైదు శిక్షలున్నాయి. శిక్షలు పడ్డ వారిలో 35 మంది రౌడీషీటర్లున్నారు" అని వివరించారు.

**మహిళలపై నేరాలు**

మహిళలపై నేరాలు స్వల్పంగా పెరిగాయని డీజీపీ చెప్పారు. గత ఏడాది 19,013 కేసులు నమోదవ్వగా.. ఈ ఏడాది వాటి సంఖ్య 19,922కు పెరిగిందన్నారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసుల్లో 18% మేర తగ్గుదల నమోదైందని వివరించారు. "రాష్ట్రంలో పనిచేస్తున్న 27 భరోసా కేంద్రాలు గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచారం కేసుల్లో బాధితులకు అండగా ఉంటున్నాయి. ఈ ఏడాది షీటీమ్స్‌కు 10,862 ఫిర్యాదులు రాగా.. వాటిపై 830 కేసులు నమోదు చేశాం. మిగతా వాటిల్లో 3,329 పెటీ కేసులు. ఇతర కేసులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించాం. భరోసా కేంద్రాలకు 2,964 ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో 1,974 పోక్సో కేసులు కాగా.. 574 అత్యాచారాలు, 436 ఇతర వేధింపులకు సంబంధించిన కేసులున్నాయి" అని వెల్లడించారు. రేప్, పోక్సో కేసులకు సంబం?ధించి బాధితులకు ప్రభుత్వం రూ.5.42కోట్ల మేర నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు.

**రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని జితేందర్ తెలిపారు. "గత ఏడాది 23,491 రోడ్డు ప్రమాద కేసులు నమోదవ్వగా.. ఈ వాటి సంఖ్య 20,702కు తగ్గాయి. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు కూడా 1.49% మేర తగ్గాయి. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 6,640మంది మరణించగా, ఈ ఏడాది 6,541మంది మరణాలు నమోదయ్యాయి. అత్యంత ఘోరమైన ప్రమాదాలు 2,336 నుంచి 1,018కి తగ్గాయి" అని వివరించారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్‌స్పాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవడం ప్రమాదాల్లో తగ్గుదల సాధ్యమైందన్నారు. డీజీపీ వెల్లడించిన మరిన్ని ముఖ్యాంశాలు..

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. విదేశాల్లో తలదాచుకుంటున్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌లను రప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై విచారణ కొనసాగుతోందని, కోర్టు పరిధిలోని అంశం కావడంతో దీనిపై మాట్లాడలేనని స్పష్టంచేశారు. బౌన్సర్లపై వచ్చిన ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని, తేడా వస్తే వదిలేది లేదన్నారు. మొట్ట మొదటి డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎసబీ), తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీ-న్యాబ్)ను మరింత పటిష్ఠం చేస్తున్నాం. ప్రొవిజన్ మరియు లాజిస్టిక్ విభాగం ద్వారా పాత వాహనాలు, తుక్కు సామగ్రి అమ్మకం ద్వారా రూ.9.49 కోట్లను ప్రభుత్వానికి డిపాజిట్ చేశామన్నారు. రాష్ట్రంలో 53,651 సీసీ కెమెరాలు పోలీసు ఠాణాల్లో ఉన్నాయని.. 11,64,645 సీసీ కెమెరాలు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. సగం ఠాణాల్లో సీసీ కెమెరాలు లేవని 'ఆంధ్రజ్యోతి' అడిగి ప్రశ్నకు బదులిస్తూ.. దశల వారీగా అన్ని పోలీసస్టేషన్లలో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. పని ఒత్తిడి, వివిధ కారణాలతో పోలీసు సిబ్బంది ఆత్మహత్యలు నమోదయ్యాయని, వీటిని నివారించేందుకు ప్రతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఎప్పటికప్పుడు పోలీసు శాఖలో రిక్రూట్‌మెంట్లు జరుపుతున్నామని.. ఈ ఏడాది 13 వేల మంది కొత్త కానిస్టేబుళ్లు నియమితులయ్యారని డీజీపీ వివరించారు. వీరిలో 30% మహిళలేనని తెలిపారు. డయల్ 100, 112 సమర్థంగా పనిచేస్తున్నాయని, ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో పోలీసులు సంఘటనాస్థలికి వెళ్తున్నారని వివరించారు.

**పిల్లల రక్షణకు హ్యాండ్ బుక్**

డిజిటల్ యుగంలో చిన్నారులు సైతం స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లను వాడుతున్నారు. ఇంటర్నెట్‌ను సర్ఫ్ చేయగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల భద్రతకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎసబీ) రూపొందించిన హ్యాండ్ బుక్‌ను డీజీపీ విడుదల చేశారు.

# శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

శేరిలింగంపల్లి,డైలీ రిపోర్ట్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం చెన్నై నుండి విచ్చేసిన మృణాళిని త్యాగరాజన్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో గణేశా స్తుతి, వర్ణం, పదం, తిల్లాన అంశాలను న్రిత్యతి, అభినయ, శక్తి,శ్రీనిధి, అడిశ, ఇందుమతి, శ్రీనీతి, మిథాలీ, కమ్లి, కనిష్క లు చక్కని ప్రదర్శన ఇచ్చారు. హైదరాబాద్ అస్సాం అసోసియేషన్ వారు బిహు డాన్స్ మరియు బిహు సంగీతాన్ని అందించారు. డిసెంబర్ 31వరకు ఈ అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ కొనసాగనుంది.







ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండ్ కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ముత్యాల ముగ్గుల పోటీలు

**డైలీ రిపోర్ట్,శేరిలింగంపల్లి:** మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కారించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగాఆదివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గల నేతాజీ నగర్ నందు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ " పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు"అని అన్నారు. " ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుంది. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. నేటి యువతరం మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నాము" అని అన్నారు. " ఈ ముగ్గుల వలన పరిసరాలు పరిశుభ్రతగా ఉంటాయి. గోమయంతో కళ్ళాపి జల్లి బియ్యపు పిండితో ముగ్గులు వేయడం వలన బియ్యపు పిండి తినడానికి చీమలు చేరతాయి. ఆ విధంగా చీమలు క్రిమి కీటకాదులు ఇంటి లోనికి రాకుండా అడ్డుకుంటాయి. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలు అనేక శరీర భంగిమలలో పనిచేయవలసి ఉటుంది. ఈ వ్యాయామ ప్రక్రియ వలన మహిళలలో అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. కావున ప్రతి మహిళ కూడా ప్రత్యేకించి ఈ ధనుర్మాసం మొత్తం నెలరోజులు అత్యంత ఉత్సాహంగా వేకువ ఝామున లేచి ముగ్గులు వేయడం ప్రారంభిస్తారు" అని అన్నారు. పోటీలలో విజేతల ఎంపికలో తాటిచర్ల వరలక్ష్మి, అనూషా జడ్జీలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో 25మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాలు కుమారి మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలి: సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిరెడ్డి



**అనంతగిరి,డిసెంబర్ 29(డైలీ రిపోర్ట్):** ఈ నెల 30న నల్లగొండలో జరగనున్న సీపీఐ బహిరంగ సభ విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిరెడ్డి మండల ప్రజలకు పిలుపునిచ్చారు.ఆదివారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజల నిత్యవసరాల ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తుందన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని ధ్వంసం చేయడం కోసమే ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చిందన్నారు.సీపీఐ జమిలి ఎన్నిక బిల్లును వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.భారత స్వాతంత్ర్యోద్యమం,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం,వేలాది ఎకరాల భూమి పేదలకు భూమి పంచడంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని అన్నారు.వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.నిరుపేదలకు ఇళు ,,రేషనకార్డులు,పింఛన్లు దక్కే వరకు పేదల పక్షాన నిలబడి వీరోచిత పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర సీపీఐ అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణారెడ్డి,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో విశేష పూజలు

**శంకర్‌పల్లి డిసెంబర్ 29:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర స్వామి దేవస్థానంలో నేడు సోమవారం సోమావతి అమావాస్య సందర్భంగా విశేష పూజలు ఉంటాయని ఆలయ ప్రధాన అర్చకులు సాయి శివ తెలిపారు. ఈ సందర్భంగా సాయి శివ మాట్లాడుతూ ఆవు పాలతో శివుడికి చంద్రహోరలో పూజ చేసుకోవడం ద్వారా మనశ్శాంతి కలుగుతుందని, క్షీరన్నం, పెరుగన్నం నల్ల కుక్కకి పెట్టినచో శత్రుజయం కలుగుతుంది. ప్రదోషకాలంలో చండీ ప్రదక్షిణ విశేష ఫలితాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.






# డప్పు కళాకారులు నూతన కమిటీ ఎన్నిక

**జోగులాంబ గద్వాల ,డిసెంబర్ 28(డైలీ రిపోర్ట్):** జోగులాంబ గద్వాల జిల్లా డప్పు కళాకారులు కార్యక్రమంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది ఈ యొక్క కమిటీ గౌరవ మందకృష్ణ మాదిగా నాయకత్వంలో లక్ష డబ్బులు వెయ్యి గొంతులు ఫిబ్రవరి 3 చలో హైదరాబాద్ విజయవంతం చేయుటకై ప్రతి మాదిగ పల్లె నుండి వేలాదిగా తరలిరావాలని నూతన మండల కమిటీని గౌరవ డాక్టర్ ఏపూరి సోమన్న డాక్టర్ డప్పు స్వామి మాదిగ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు మాదిగ నేలహల్లి చరణ్ మాదిగ గౌరవ అధ్యక్షులు డ్యామ్ వెంకటన్న రంగస్వామి వారి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ కేపీ గడ్డి మండల ఇన్చార్జి గువ్వలదిన్నె జంబయ్య వీరి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది.

**నూతన కమిటీ సభ్యుల వివరాలు**

అధ్యక్షుడు పాంటన్న(గంగనపల్లి) ఉపాధ్యక్షులు కొలిమినర్సింలు(పాగుంట) డి గోపాల్(పాగుంట) ప్రధాన కార్యదర్శి, కృష్ణ(కొండాపురం) సహాయ కార్యదర్శులు, గోపి,స్వామినర్సింలు, రాజు, తెల్లనర్సప్ప కోశాధికారి ,ఆనంద్ కార్యవర్గసభ్యులుజి,బుచ్చన్న సురేష్‌జి, సామెల్ గౌరవ అధ్యక్షులు గువ్వలదిన్నెజంబయ్య ,ఎం ఆర్ పి ఎస్ ఇంచార్జి కే టి దొడ్డి మండలం మసీదుతాయప్ప, నక్కలినర్సింలు, విష్ణు,రాము,బెల్లంనర్సింలు, మీసాలరంగప్ప, ఆంజనేయులు,గోపాల్, జయన్న,రాబిన్, అసల్ నర్సింలు, సురేష్ ప్రచార కార్యదర్శులు శ్రీను రాజశేఖర్.

# త్వరలో హైదరాబాద్ – డాలస్ విమానం

**హైదరాబాద్ నుంచి పెరిగిన ఇంటర్నేషనల్ కనెక్టివిటి**

**ప్రస్తుతం 20 నగరాలకు సదుపాయం**

**త్వరలో మరిన్ని నగరాలకు విస్తరణ**

**కొత్తగా వియత్నాం, అజర్‌బైజాన్. ఇథియోపియాకు విమానాలు**




భాగ్యనగరం నుంచి అంతర్జాతీయ నగరాలకు విమాన సర్వీసులు విస్తరిస్తున్నాయి. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం.. కేవలం ట్రాన్సిట్ ఎయిర్‌పోర్ట్‌గానే కాకుండా పశ్చిమాసియా దేశాలకు ప్రధాన హబ్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల ప్రయాణికులు హైదరాబాద్ నుంచి గణనీయంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో హైదరాబాద్ కేంద్రంగా పలు ఎయిర్‌లైన్స్ తమ విమాన సర్వీసులను విస్తరిస్తున్నాయి. ఏటా సుమారు 4 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలకు అనుగుణమైన సామర్థ్యంతో.. ఎయిర్‌పోర్ట్ సేవలను విస్తరిస్తున్న నేపథ్యంలో.. హైదరాబాద్ దేశంలోనే ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఒకటిగా మారింది. దీంతో ప్రస్తుతం పలు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతున్న విమానయాన సంస్థలు.. మరిన్ని కొత్త నగరాలకు తమ సేవలను కొనసాగించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి దుబాయ్, మస్కట్, బహ్రెయిన్, దోహా, షార్జా, జెడ్డా, అబుదాబి, రియాద్, సింగపూర్, బ్యాంకాక్, మలేసియా, బ్రిటన్, జర్మనీ, శ్రీలంక, మాల్దీవులు, ఒమన్, ఖతార్, సౌదీ తదితరాలకు నేరుగా విమానాలు నడుస్తున్నాయి. గతంలో షికాగోకు విమాన సర్వీసులను నడిపారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయాయి. త్వరలో షికాగోతోపాటు డాలస్, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాలకు కూడా హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రోజూ సుమారు 55000 మంది దేశీయ, మరో 15000 మందికి పైగా అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్క నవంబర్ నెలలోనే 40,179 మంది హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి విదేశీయానం చేశారు. 2467 అంతర్జాతీయ సర్వీసులు నడిచాయి.

ఆసియా దేశాల్లో యూరప్ అనుభూతి

ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తదితర యూరప్ దేశాల పర్యటన ఖరీదుగా మారింది. నలుగురు కుటుంబసభ్యులు కలిసి వారం రోజుల పాటు పర్యటించాలంటే కనీసం రూ.8 లక్షల పైనే ఖర్చువుతుంది. కానీ చాలా తక్కువ బడ్జెట్‌లో యూరప్ దేశాల్లో పర్యటించిన అనుభూతిని కలిగించేవిధంగా కొన్ని దేశాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జార్జియా, అజర్‌బైజన్, ఉజ్బెకిస్తాన్, ఆర్మీనియా తదితర దేశాలు.. తక్కువ బడ్జెట్‌లో సందర్శించేందుకు అనువుగా ఉన్నాయి. దీంతో ఈ దేశాలను ఎక్కువమంది ఎంపిక చేసుకుంటున్నట్లు పర్యాటక సంస్థలు పేర్కొంటున్నాయి. 'స్విట్జర్లాండ్‌లోని మంచుకొండల్లో విహరించాలని కోరుకొనేవాళ్లు ఇప్పుడు కజకిస్తాన్‌లోని షింబులాక్ మౌంటెయిన్స్‌ను ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. స్విట్జర్లాండ్ పర్యటనకు కనీసం రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందనుకంటే.. కేవలం రూ.2 లక్షల్లోనే కజికిస్తాన్ పర్యటనను పూర్తి చేయవచ్చు. ఇలా బడ్జెట్ ఫ్రెండ్లీ టూర్స్‌కు ప్రాధాన్యం పెరిగింది'.. అని వాల్మీకి ట్రావెల్ అండ్ టూరిజమ్ సొల్యూషన్స్ ఎండీ హరికిషన్ వాల్మీకి తెలిపారు. మరోవైపు ఉచిత వీసా సదుపాయం కలిగిన దేశాల్లో కూడా ఎక్కువమంది పర్యటిస్తున్నారు. మలేసియా, థాయ్‌లాండ్ వంటి దేశాలు ఆ సదుపాయాన్ని అందజేస్తున్నాయి.

త్వరలో రష్యా సైతం ఉచిత వీసా సదుపాయాన్ని ప్రవేశపెట్టనుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగానికి ప్రాధాన్యం పెరిగింది. దీంతో ట్రావెల్స్ ఏజెన్సీలు, పర్యాటక సంస్థలు ఎప్పటికప్పుడు కొత్త ప్యాకేజీలతో ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో పలు ఎయిర్‌లైన్స్ కూడా ఈ డిమాండ్ మేరకు సర్వీసులను విస్తరిస్తున్నాయి. ఇండిగో, ఎయిర్‌ఇండియా వంటి సంస్థలు తమ సర్వీసులను పెంచుతున్నాయి.

**ఆఫ్రికా దేశాలకు కనెక్టివిటీ..**

కేఎల్ఎం ఎయిర్‌లైన్స్.. నెదర్లాండ్స్, ఇథియోపియా ఎయిర్‌లైన్స్ ఇథియోపియా తదితర దేశాలకు త్వరలో విమాన సర్వీసులను ప్రవేశపెట్టనుంది. ఇథియోపియాకు విమానసర్వీసులు అందుబాటులోకి రావడం వల్ల హైదరాబాద్ నుంచి ఆఫ్రికా దేశాలకు కనెక్టివిటీ ఏర్పడనుంది. వియట్ జెట్ ఎయిర్‌లైన్స్ హైదరాబాద్ నుంచి వియత్నాంకు విమానాలు నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. టర్కీకి కూడా డైరెక్ట్ కనెక్టివిటీ ఏర్పాటు కానుంది. అమ్‌స్టర్‌డామ్, డల్లాస్ నగరాలకు కూడా 2025లోనే సర్వీసులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 20 అంతర్జాతీయ నగరాలకు నేరుగా విమానాలు నడుస్తుండగా, 2025లో మరో 10 నగరాలకు కనెక్టివిటీ ఏర్పాటు కానుంది.

# కేసీఆర్ ముందుచూపుతోనే ట్రిపుల్‌ఆర్

**బీఆర్ఎస్ హయాంలోనే ఉత్తర భాగానికి అనుమతులు**

**కేవలం టెండర్లు పిలిచి గొప్పలు చెప్పుకొంటున్న రేవంత్**

**కేసీఆర్ ప్రభుత్వంపై మంత్రి కోమటిరెడ్డి ఆరోపణ తగదు**

**బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దూరదృష్టి, ముందుచూపుతో రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఆలోచన చేశామని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి వచ్చే పది జాతీయ రహదారులను అనుసంధానించేలా ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ రూపొందించామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంశంపై ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణామంత్రి నితిన్ గడ్కరీతో కేసీఆర్, తాను సహచర బీఆర్ఎస్ ఎంపీలతో కలిసి అనేక సందర్భాల్లో చర్చించామని, అనుమతులు పొందామని గుర్తుచేశారు. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) తరహాలో సుమారు 300 కిలో మీటర్ల మేర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ట్రిపుల్‌ఆర్ నిర్మిస్తే వేల కోట్ల తెలంగాణ ప్రజల ధనం ఖర్చవుతుందని నాడు కేసీఆర్ భావించారని తెలిపారు. తెలంగాణ ప్రజల సొమ్ము ఖర్చు కాకుండా, కేంద్ర నిధులతో రోడ్డు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. నాగ్‌పూర్, భూపాలపట్నం, భద్రాచలం, విజయవాడ, బెంగళూరు, బెల్గాం, ముంబై, నాందేడ్, మెదక్–పిట్లం, రాజీవ్ రహదారి.. ఇలా మొత్తం పది ముఖ్యమైన రహదారుల నుంచి వాహనాలు నగరంలోకి రాకుండానే గమ్యస్థానాలకు వెళ్లేలా హైవేల అనుసంధానంతో ట్రిపుల్‌ఆర్ నిర్మించాలని నిర్ణయించారని పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు, హైవేస్ (మోర్త్) అధికారులను ఢిల్లీ నుంచి తీసుకొచ్చి వారితో అనేకసార్లు అలైన్‌మెంట్‌పై నాటి సీఎం కేసీఆర్ చర్చించారని గుర్తుచేశారు. అనేక చర్చల అనంతరం ఉత్తర భాగానికి చెందిన ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి అనుమతులు లభించాయని తెలిపారు. దక్షిణభాగానికి సైతం కేసీఆర్ హయాంలోనే ప్రణాళికలు జరిగాయని, ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రతిపాదనలు ఆగాయని పేర్కొన్నారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం ఏమీ చేయలేదని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించడం తగదని హితవుపలికారు. ఆ మాటలు అనే అర్హత కోమటిరెడ్డికి లేదని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు.ముందున్న ప్రభుత్వాలు తలపెట్టిన పనులు కొనసాగించడం తదుపరి వచ్చే ప్రభుత్వ బాధ్యత అని, పంతాలకు పోకుండా నాటి ట్రిపుల్‌ఆర్ పనులను కొనసాగిస్తున్నందుకు సంతోషమని తెలిపారు.

# సంతోషాల మధ్య నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం: జిల్లా ఎస్పీ సి హెచ్ రూపేష్

**వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే ఉపేక్షించం.**

**జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్త్‌తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు**



**సంగారెడ్డి బ్యూరో డిసెంబర్ 29 (డైలీ రిపోర్ట్):** సంతోషాల మధ్య నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రూపేష్ ప్రజలకు సూచించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ జిల్లా పరిధిలోని ప్రజలు ప్రశాంతమైన వాతవరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్బంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం ముఖ్యంగా క్యూ ఆర్ టి, ప్రత్యేక పార్టీ, సీసీ ఎస్, ప్రత్యేక శాఖ, ఐ టిసెల్ బృందం, షి టిమ్ బృందాలతో పటిష్ట బందోబస్త్ మధ్య ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. పోలీసుల అధ్వర్యంలో పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

**పోలీసుల సూచనలు నిబంధనలు....**

1. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలి. తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటా0.
2. టపాసులు, మైకులు ఎక్కువ సౌండ్ పెట్టి ఎవరిని ఇబ్బంది పెట్టకూడ దని డీజే లు నిషేధం, వినియోగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తాం.
3. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు ఇష్టానుసారంగా వేగంగా నడిపితే కేసులు నమోదు చేయడంతోపాటు జైలు శిక్ష విధించబడుతుంది.
4. ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం, మహిళలను ఇబ్బంది పెట్టిన, అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా0.
5. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా0.
6. న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
7. మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు.
8. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం.
9. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారి వల్ల ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే వారి సంరక్షకుల పైన కేసులు నమోదు చేస్తాం.
10. ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్బంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలి. పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ సీహెచ్ రూపేష్ ప్రజలకు సూచించారు.

2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ, జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707